విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 17, మార్చి 2024

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని విద్యానగర్ ప్రజలకు నీటికొరత ఏర్పడకుండా ముందస్తుచర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం వార్డు విజయమ్మ అభ్యర్థన మేరకు షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి మంచినీటి బోరు వేయించారు. సుమారు 470 అడుగులు తవ్వగా 3 ఇంచుల నీరు పడిందన్నారు. ఈ మంచినీటి బోరు వేయడం ద్వారా విద్యానగర్, సుబ్బారావుపేట ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు విజయమ్మ,లక్ష్మిదేవి, వీరబొమ్మ రూపాదేవిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్‌లు రజిని కుమార్‌రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ, వి.ఆర్ శ్రీను, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

భీమా తక్షణ సహాయం పంపిణీ

విశాలాంధ్ర-చాగలమర్రి : మండల కేంద్రమైన చాగలమర్రిలోని 5వ సచివాలయం 17వ వార్డు పరిధిలోని మట్టా తిమ్మయ్య (32) ఈ నెల 13 న అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ భీమాతక్షణ సహాయం కింద రూ.10 వేలు సర్పంచు తుల సమ్మ, ఇన్‌చార్జ్ ఈవో నాగమణి శనివారం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ భీమా చేసిన వారు సహజ మరణం చెందితే లక్ష రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అందులో భాగంగా తక్షణ ఆర్థికసాయంగా రూ.10 వేలు మృతుడి భార్య వరలక్ష్మికి అందజేసామన్నారు. మిగతా మొత్తాన్ని ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. కార్యక్రమం లో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, ఎంపిటిసి ఫయాజ్, వైసీపీ నాయకులు ఖాధర్ బాష, షేక్షావలి, వెల్ఫేర్ అసిస్టెంట్ సుజాత, సచివాలయ కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించండి

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల పట్టణంలోని మున్సిపల్ ఉపాధ్యాయుల విలీన ప్రక్రియలో భాగంగా మున్సిపల్ శాఖ నుంచి విద్యా శాఖలోకి మార్చిన సందర్భంలో క్యాడర్ స్ట్రెంత్‌లో దొర్లిన తప్పిదాల కారణంగా కొందరి మున్సిపల్ ఉపాధ్యాయుల జీతాలు నిలిచిపోయాయి. ఈ విషయంపై నంద్యాల సహాయ ట్రెజరీ అధికారిని కలిసి మున్సిపల్ ఉపాధ్యాయులకు త్వరగాజీతాలు మంజూరయ్యేలా చేయాలని ఎస్టీయూ సంఘ పక్షాన ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టీయు నంద్యాల జిల్లా అధ్యక్షులు మౌలాలి, రాష్ట్ర కార్యదర్శి గోపాలకృష్ణ, రాష్ట్ర సాంకేతిక కమిటీ కన్వీనర్ నాగేంద్ర కుమార్, నంద్యాల మున్సిపల్ ఉపాధ్యాయులు షరీఫ్, మున్సిపల్ మహిళా ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

మద్దిలేటయ్య ఆదాయం రూ.9.13లక్షలు

విశాలాంధ్ర-బేతంచెర్ల : ఆర్‌ఎస్ రంగాపురం గ్రామసమీపంలో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీమద్దిలేటి స్వామిక్షేత్రం శనివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువ జామున స్వామి అమ్మవారికి ఆలయ వేదపండితులు ముఖ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువ జామున అభిషేకాలు, గండా దీపాలు, పుట్టు వెంట్రుకలు మొక్కులు చెల్లించుకున్నారు. రూముల బాడుగలు, సేవ టికెట్లు, లడ్డు ప్రసాదాలు, లీజుల వసూళ్లు, మొదలగు వాటి ద్వారా రూ.9,13,895 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఎం.రామాంజనేయులు, ఆలయ చైర్మెన్ బి.సీతరామచంద్రుడు తెలిపారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఎం.ఇ.రామకృష్ణుడు,ఎం.ఇ.విజయ భాస్కర్‌గౌడ్‌లు స్వామివారికి 2.670 కేజీల బరువు గల మూడు వెండి హారతులు సమర్పించారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బీమునిపాడుకు చెందిన టి.మధుసుధన్ స్వామివారికి 230 గ్రాముల వెండికిరీటం విరాళంగా అందచేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న డమ్మీ అకామీడేలు

విశాలాంధ్ర-నంద్యాల రూరల్: నంద్యాల జిల్లా కేంద్రంలోఎటువంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా -డమ్మీ అకామిడీలు పుట్టుకొస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీట్, జేఈఈ అకాడమీలు కొన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీలు విద్యార్థులకు ఆశచూపి వారి తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు. ఫ్యాకల్టీస్ సౌకర్యాలు అలాగే ప్రభుత్వం నుంచి అనుమతులు లేకున్నా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం మాత్రం ప్రచారాలు నిర్వహిం చుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యంగా ఐఐటీ, నీట్ , జేఈఈ, ఏపీ ఈఏపీసెట్ పేర్లతో నకిలీ అకాడమిలు వెలుస్తున్న పట్టించుకోవడంలేదన్నారు. ప్రధానంగా కళాశాల యాజమాన్యం గ్రామీణ ప్రాంత విద్యార్థులనే లక్ష్యంగా చేసుకొని ఫీజుల పేరుతో వేలకు వేలు డబ్బులు గుంజడం యాజమాన్యానికి అలవాటు అయిందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, కట్టడి చేయకపోతే కాలేజీల ఎదుట,డమ్మీ అకాడమీల దగ్గర ఆందోళనలు చేపడతామని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేయండి

విశాలాంధ్ర-నంద్యాల: సాధారణ ఎన్నికలు - 2024 ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు డీపీఆర్వోను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల మీడియా సెంటర్, కమాండ్ కంట్రోల్ రూమ్, కంప్లైంట్ సెల్ తదితర విభాగాలను డిఆర్ఓ ఎ. పద్మజతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేయాలని ఆదేశించారు. ఎన్నికల మీడియా సెంటర్ లో 1952వ సంవత్సరం నుండి 2019 వరకు లోక్ సభ, అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేసిన అభ్యర్థులు, సమీప ప్రత్యర్థులపై గెలుపొందిన ఓట్ల వివరాలతో వున్న సమాచారాన్ని మీడియాకు ఇవ్వాలన్నారు, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలో పాటు ఆళ్లగడ్డ, శ్రీశైలం,నందికొట్కూర్, నంద్యాల, బనగానపల్లి, డోన్, అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేసిన అభ్యర్థులు, సమీప ప్రత్యర్థులపై గెలుపొందిన ఓట్ల వివరాలు, నియోజకవర్గ మ్యాపుల్లో సంక్షిప్తమై ఉన్న పోలింగ్ స్టేషన్ల వివరాలు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే నమోదు చేసుకొని తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించి ఎన్నికల ప్రవర్తన నియమావళి పటిష్ట అమలుపై ప్రసార మాధ్యమాలలో ప్రసారం అవుతున్న అంశాలను నిరంతరం పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ను ఆదేశించారు. కంప్లైంట్ సెల్ కు వచ్చే ఫిర్యాదులను కూడా వెంటనే స్పందించి తక్షణ చర్యలను తీసుకోవాలని ఆయన సంబధిత అధికారులన ఆదేశించారు. అలాగే ఎన్నికల విభాగాన్ని పరిశీలించి సిబ్బంది ఎవరెవరు ఏఏ పనులు చేస్తున్నారన్న అంశాలపై ఆరాతీస్తూ ఎన్నికల విధుల్లో అలసత్వం లేకుండా అప్పగించిన పనులను వెంటనే చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-నంద్యాల అర్బన్ : నంద్యాల పట్టణంలోని నూనెపల్లె

ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారంఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఎలాంటిమౌలిక సదుపాయాలు లేకపోవడం, విద్యార్థులు చదువుల్లో ఎలాంటి పురోగతి సాధించకపోవడం, పాఠశాల ఉపాధ్యాయులు పూర్తిగా విఫలమయ్యారని, పాఠశాలహెచ్ఎం రేణుకాదేవిపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు డీఈఓ సుధాకర్, ఎంఈఓ బ్రహ్మం నాయక్, పై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

'టీ కాఫీ తాగడం తప్ప' నాడు- నేడు కింద ఎలాంటి మార్పులేని ఈపాఠశాలను చూసి ఆశ్చర్యానికి గురయ్యానన్నరు. ఐఏఎస్ అధికారి అడుగుతున్న ప్రశ్నలకు, మౌనం పాటించిన, జిల్లా అధి కారులు ఎటువంటి సమాధానాలు ఇవ్వకపోవడం గమనార్హం.

ఎన్నికలషెడ్యూల్ రాకతో ప్రజలకు స్వాతంత్ర్యం..

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్ : ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఏపీ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చి నట్లుగా ఉందని తెలుగుదేశం పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. రానున్న ఎన్నికల్లో సైకోను ఇంటికి పంపుతున్న కోడ్ అమల్లోకి వచ్చిందని వారి ముఖాల్లో సంతోషాలువెల్లువిరిశాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు ఏన్నో కష్టనష్టాలు పడ్డారనీ,మార్పు కావాలంటే టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్రాల్లో వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలు గెలవాలి. మా నినాదం స్వాతంత్ర్య పోరాటం తరహాలో ఏపీని ఉన్మాది పాలన నుంచి విముక్తి చేసేలా పోరాడాలన్నారు. నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్, అద్దాలాపురం భాష, సతీష్, నాగురుఖాన్ తదితరులు పేర్కొన్నారు.

ఆళ్లగడ్డ వైసీపీ టికెట్ గంగుల బిజేంద్రారెడ్డికి ఖరారు



విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ అసెంబ్లీ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేరును శనివారం ముఖ్యమంత్రి జగన్ ఇడుపులపాయలో ఖరారు చేయడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఆళ్లగడ్డ వైకాపా అభ్యర్థిగా గంగులబ్రిజేంద్రారెడ్డి తిరిగి బరిలో ఉండటంతో గతంలో లాగా భూమా-గంగుల కుటుంబాల మధ్యనే ప్రధానంగా పోరు కొనసాగనున్నది. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆళ్లగడ్డ అసెంబ్లీ టికెట్ గంగుల బ్రిజేంద్రారెడ్డికి ఖరారు కావడంతో గత కొన్ని రోజులుగా కొనసాగిన ఊహాగానాలకు తెరపడింది. గంగులబ్రిజేంద్రారెడ్డికి టికెట్ ఖరారు అయిన నేపథ్యంలో వైకాపా నాయకులు సంబరాల్లో మునిగిపోయారు. ఇప్పటికే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తెలుగుదేశం, వైకాపా పార్టీలు ప్రచార జోరును పెంచాయి. శనివారం రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో ప్రచార హోరు మరింత పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆళ్లగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజకీయ ప్రస్థానం

ఆళ్లగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రారెడ్డిని అధిష్టానం మరోసారి ఖరారు చేసింది. హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాలైన యూసఫ్ గూడా లోని మేరీస్ కాలేజీలో 2008లో బీకాం గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2017 లో వైసీపీలో చేరి రాజకీయ రంగ ప్రవేశం చేసి 2019 లో జరిగిన ఎన్నికలలో 35,613 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈసారి మళ్లీ తనకే టికెట్ రావడంతో మరోసారి తన అదృష్టాన్ని పరిష్కరించుకొనున్నారు.

వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవటం ఖాయం- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పన్నుల బాదుడుతో రాష్ట్ర ప్రజల రక్తం పీల్చుతూ కూడా ప్రజలను ఉద్ధరిస్తున్నా అనే మాయగాడు జగన్‌రెడ్డి అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్థన్‌రెడ్డి మండి పడ్డారు. శనివారం మండల కేంద్రమైన కోవెలకుంట్లలోని రంగరాజుపేటలో పార్టీ నిర్వహించిన బాబు సూపర్ 6 పథకాలను ఇంటింటి కార్యక్రమంలో బీసీ వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డిమాట్లాడుతూ ఇక నుండి రాక్షస పాలన నుండి ప్రజలకు విముక్తి లభిస్తోందని మరో 50 రోజుల్లో పూర్తి స్వేచ్ఛ లభిస్తుందిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్ ను ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ రెడ్డి ఐదేళ్ల విధ్వంసక, విద్వేష పాలనతో రాష్ట్రాన్ని అన్నివిధాల నాశనం చేశారన్నారు. ఎస్సీ,ఎస్టీకి చెందిన 28 పథకాలు,బీసీకి చెందిన 30 పథకాలు, మైనార్టీలకు చెందిన 11 పథకాలను రద్దు చేసి వందలాదిమందిపై మారణహోమం సృష్టించిన నీ పాలనకు ముగింపు పలికే సమయం ఈరోజుతో మొదలైందని ఐదేళ్లలో మేనిఫెస్టోలో 30% హామీలను కూడా అమలు చేయకుండా అన్ని వర్గాలవారిని వంచించిన నిన్ను శాశ్వతంగా రాజకీయ సమాధి చేయడం ఖాయం అన్నారు. జగన్ రెడ్డికి ఓటు వేయొద్దని రక్తం పంచుకొని పుట్టిన సొంత చెల్లెళ్లే చెబుతున్నారని ఎద్దేవాచేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచే కాదు,ఈ రాష్ట్రం నుంచి కూడా ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఈ జగన్ ప్రభుత్వం పెంచిన విద్యుత్, ఆర్టీసీ, మద్యం ధరలు పన్నులు పెట్రోల్ ధరలు, బాదుడు అప్పుల వల్ల ఒక్కో కుటుంబ పైన గడిచిన ఐదు ఏళ్లలో 5 నుంచి 6 లక్షలు భారం మోపాడు జగన్ రెడ్డి అని బీసీ జనార్దన్ రెడ్డి ధ్వజమెత్తారు. అలాగే చంద్రబాబు ప్రకటించిన 6 పథకాలను ఇంటింటికి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు కార్యకర్తలు, ప్రజలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.

ఎగువ అహోబిలంలో మనంగా ధ్వజారోహణ, భేరిపూజ

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఎగువఅహోబిలంలో లక్ష్మీ నరసింహ్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణం, అభిషేకం, భేరిపూజ, సింహవాహన కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణంలో భాగంగా నిత్యహోమం, సోమకుంభ స్థాపన, పాలికావాహనం, గరుడ ప్రతిష్ఠ చేశారు. ధ్వజస్థంభానికి గరుత్మంతునికి షోడశకలశస్నపన ధ్వజపట ఆరోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ధ్వజారోహణంలో భాగంగా పూలు, దర్పంతో పాటు గరుడివి చిత్రపటాన్ని ఉంచి ధ్వజస్థంభం వద్ద తాడును పైకిలాగి ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. అవరోహణం రోజున ధ్వజపటాన్ని క్రిందికి లాగుతారు. భేరి పూజలో భాగంగా భేరితాటామ మ్రోగించి నమస్త దేవతలను బ్రహ్మోత్స వాలకు ఆహ్వానించారు. బ్రహ్మోత్స వాల ఆరంభంలో మొదటిరోజున స్వామికి రక్షాబంధనం చేసిన తరహాలో రెండవరోజున సైతం అర్చకులు రక్షాబంధనం చేశారు. అభిషేకంలో భాగంగా ఎగువఅహోబిల ఉత్సవమూర్తులు జ్వాలానరసింహస్వామి, శ్రీదేవి, భూదేవిలకు అభిషేకం జరిపారు. నవకలశాలతో ఒక్కో దేవతమ ఒక్కో కలశంతో ఆవాహనం చేసుకుని ఉత్సవమూర్తులకు అభిషేకం జరిపారు. అనంతరం తులసిమాలలతో అలంకరించి హారతి, మహా హారతులు అందజేశారు. అనంతరం మండపంలో కొలువుంచిన ఉత్సవ మూర్తులతో పాటు ప్రధాన మూర్తులను భక్తులు దర్శించి ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఎగువ అహోబిల ఆలయ పరిసరాల్లో సుదర్శనమూర్తిని ఊరేగించారు. గ్రామోత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులను ఎగువ అహోబిల ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. సింహవాహన సేవలో భాగంగా సింహవాహనంపై ఎగువ అహోబిల ఉత్సవమూర్తి జ్వాలా నరసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. దుష్టశిక్షణ శిష్యరక్షణకు సంబంధించి నరసింహస్వామి భక్తుడు ప్రహ్లాదవరదుడిని కాపాడినందుకు, ధర్మాన్ని రక్షించినందుకు అద్భుత అవతారంగా స్వామి సింహావతారం లో భక్తులకు దర్శనమిస్తారు. సింహ వాహనంలో జ్వాలా నరసింహ స్వామిని కొలువుంచి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి ఎగువ అహోబిల ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. అలాగే దిగువ అహోబిలంలో అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన -అర్చకుడు దేవస్థానం ముద్రకర్త వేణుగోపాలన్ తో పాటు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిపిఏ సంపత్, ఓఎస్డి కాశీభట్ల శివప్రసాద్, కమ్యూ నికేషన్ ఆఫీసర్ సేతురామన్ తది తరులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసిన వైసీపీ విజయం ఆపలేరు-బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

విశాలాంధ్ర-కొత్తపల్లె : త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసిన వైసీపీ విజయం ఆపలేరని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ధారా సుధీర్‌లు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో మల్టీపర్పస్ గోదాములు నాగ పల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి సీఈఓ కోటీల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలకు ఎన్ని పార్టీలు కలసిన వైసీపీ విజయం ఆపలేరన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటివరకు రైతుల కోసం రైతుభరోసా, ఇన్ ఫుట్ సబ్సిడీ, పంటనష్ట పరిహారం, ఆర్బీకేల ద్వారా రైతులకు రసాయన ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ పనిముట్లు, హార్వేస్టర్లు వంటివి సబ్సిడీకి ఇస్తున్నారన్నారు. అదే తరహాలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంలో ప్రతిగ్రామంలో మల్టీపర్పస్ గోదాములు నిర్మించి వాటిలో రైతుల ధాన్యాన్ని భద్రపరచుకొనేందుకు వీలు కల్పిస్తున్న ప్రభుత్వం వైసీపీయే అన్నారు. కొత్తపల్లిలో రూ.1.10 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ గోదాములను ప్రారంభించడం రైతులకు సుభసూచకం అన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్సీపీ గెలువుకు ప్రతికార్యకర్త ప్రతిగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించి కృషిచేయాలని సూచించారు. జీవితాలు మార్చే సంక్షేమపాలన కావాల కంటితుడుపు హామీలిచ్చే దొంగల పాలన కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. తిరిగి సీఎంగా జగనన్ననే చేసుకుంటే సంక్షేమాభివృద్ధి జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరమణ, జిల్లాఎగ్జిక్యూటీవ్ మెంబర్ నాగ ఎల్లయ్య, కో-ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్‌గౌస్, నాగంపల్లి సొసైటీ మెంబర్ అచ్చిరెడ్డి, కొలనుభారతి చైర్మన్ వెంకటనాయుడు, సర్పంచులు మశమ్మ, బాల ఎల్లయ్య. మారెన్న ఎంపీటీసీలు స్రవంతి. బాల రాజు, శివన్న. ఆలీబాషా, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ రామ సుబ్బారెడ్డి, కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు చింతమాను శ్రీనివాసులు యాదవ్, పరశురాముడు, లింగారెడ్డి, ఏసేపు, కలిముల్లా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో ప్రత్యేక పూజలు నిర్వహించిన గిత్త జయసూర్య

విశాలాంధ్ర-నందికొట్కూరు : మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య శనివారం ఆంజ నేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు విరించారు. ఈకార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మాండ్ర రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, కురువ చిన్నరాజు, యాగంటి, నాగశేసన్న, బాలబాబు, సాంబశివుడు, ప్రవీణ్ కుమార్, దినేష్, నాగార్జున, మాభాష, గొల్ల రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్లలో పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ-1 వెంకటరామిరెడ్డి, ఎంఈఓ-2 వెంకటసుబ్బయ్య తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 254 విద్యార్థులు ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో190 విద్యార్థులు సెయింట్ జోసెఫ్ స్కూల్లో 210 విద్యార్థులు ఉన్నారని ఎంఈఓలు తెలిపారు.

స్పందన కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర -నంద్యాల రూరల్ : దేశ వ్యాప్తంగా ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని అందువల్ల ప్రతి సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్ఐసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డెమానులోని జిల్లా

పరిషత్ ఉన్నత పాఠశాలలో పది చదివే విద్యార్థులకు శనివారం ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ గ్రామ సర్పంచు రామచంద్రుడితో కలిసి పరీక్ష కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కొద్దిసమయం మాత్రమే ఉన్నందున పరీక్షలకు అవసరమయ్యే విధంగా ప్రాణాళికా బద్ధంగా ముందుకు సాగితే విజయ మీదేనని విద్యార్థులకు హిత బోధ చేశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడం ద్వారా తల్లి దండ్రులు, పాఠశాలకు పేరుప్రఖ్యాతులు సాధించిన వారవుతారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యబాగా పెరిగిందని, తల్లిదండ్రులు గురువులు దైవంతో సమానమని వారి మాట తప్పక వినాలన్నారు. అదే విధంగా గురువులు మన మంచి కోరేవారని, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు బాధ్యత తీసుకున్న పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు పెద్దపెద్ద హోదాల్లో పని చేస్తున్నారని విద్యార్థులకు గురుచేశారు. పేద పిల్లలకు సహాయ సహకారాలు అందిస్తున్న ఎల్ఐసి వారికి పాఠశాల ఉపాధ్యాయులు శివకోటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచు రామచంద్రుడు,ఆత్మకూరు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్‌శెట్టిలను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు సగినేల సత్యాలు, నవనంది పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సగినేల సుబ్బన్న పాఠశాల ఉపాధ్యాయులు నాగ సుశీల ,హబీబుల్లా ,శివమ్మ, ప్రసాద్, నౌమన్ హుస్సేన్ వ్యాయామ ఉపాధ్యాయురాలు రాజేశ్వరి దేవి మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థులు. తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ లో 32 కేసుల పరిష్కారం

విశాలాంధ్ర- ఆత్మకూరు టౌన్: జాతీయ లోక్‌దాలత్‌లో 32 కేసుల పరిష్కారం చేసినట్లు ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర రావు, ఇన్చార్జి జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణలు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్ ఆదాలత్‌లో క్రిమినల్-20, సివిల్ కేసులు-10, మొత్తం 32 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాణిక్యరావు, బలరాం నాయక్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

విశాలాంధ్ర-కొత్తపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆత్మకూరు రూరల్ సీఐ నాగ భూషణ్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కొత్తపల్లి పాటుగా లింగాపురం, శివపురం గ్రామాల్లో ఎస్సై హరిప్రసాద్ ఆధ్వర్యంలో వీధుల వెంట బిఎస్ఎఫ్ సెంట్రల్ ఫోర్స్, పోలీస్‌లతో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు ప్రేరేపించి గొడవలు చేయరాదన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. గ్రామాల్లో నాటు సారా బెల్ట్ షాపుల వారిపై ప్రత్యేక దృష్టి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలన్నారు. రాత్రి సమయంలో ప్రజలు రోడ్లమీద గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ పోలీస్ సిబ్బంది బిఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నారు.

పది విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

విశాలాంధ్ర-నంద్యాల అర్బన్ : ఈనెల 18వ తేది నుండి ప్రారంభ మయ్యే



పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవణాధికారి రజియా సుల్తానా శనివారం తెలిపారు. ఈనెల 18వ తేది నుండి 30 వ వరకు జరిగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పల్లెవెలుగు (ఆర్డినరీ) అల్ట్రా పల్లె వెలుగు, బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. బస్సు పాస్ లేకపోయినప్పటికి ఒరిజనల్ హాల్‌టికట్‌ను కండక్టర్‌కు చూపిం చి నివాస స్థలం నుండి పరీక్షా కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణం చేయచ్చన్నారు. ఈ ఉచిత ప్రయాణం కేవలం పరీక్షలు జరిగే తేదీలు, సమయాల్లో మాత్రమే అనుమతించబడుతుందని ఒకవేళ ప్రభుత్వం ఏదైనా తేదిని సెలవు దినంగా ప్రకటిస్తే ఆతేదిల్లో పరీక్ష ఉన్నాట్లయితే బస్సుల్లో ఉచితంగా ప్రయాణానికి అనుమతిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారావాణాధికారి రజియా సుల్తానా తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 17, మార్చి 2024

మంత్రాలయం టీడీపీ టికెట్ తిక్కారెడ్డికే కేటాయించాలి

విశాలాంధ్ర - కోసిగి : మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ టిక్కెట్ తిక్కా రెడ్డికే ఇవ్వాలని నియోజకవర్గం లోని నాలుగు మండలాల టిడిపి నాయకులు శనివారం కోసిగి లో భారీ ర్యాలీ నిర్వహించారు. వైసిపి కోవర్ట్ అయిన మాధవరం రాఘవేంద్ర రెడ్డికి టికెట్ ఇస్తే మేము పని చేయమని , ఇన్ని రోజులు మాకు అండగా ఉన్న పాలకుర్తి.తిక్కారెడ్డి కే టికెట్ ఇవ్వాలని, లేనిపక్షంలో నాయకులంతా రాజీనామా చేస్తామన్నారు. టికెట్‌పై పునరాలోచన చేసి తిక్కారెడ్డికు టిడిపి టికెట్ ఇస్తే కచ్చితంగా గెలిపిస్తామని కార్యకర్తలు నాయకులు దీమా వ్యక్తం చేశారు.మండలం కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్ ఛార్జ్ లుహాజరయ్యారు. గాంధీ నగర్ నుండి శ్రీ యల్లమ్మ అవ్వ దేవాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నేను కచ్చితంగా అసెంబ్లీకి పోటీ చేస్తానన్నారు. మే 16వ తేదీనే గతంలో ప్రచారంలో వెళ్ళినప్పుడు బుల్లెట్ గాయమైందని ఈఏడాది మే 16 వ తారీఖున సీటు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. చంద్ర బాబు నాయుడు పునారాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చేన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కోట్రేష్ గౌడ్,మంత్రాలయం మండలం కన్వీనర్ పన్నాగా వెంకటేశప్ప స్వామి, పెద్దకడబూరు మండలం కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షులు భరత్వాజ్ శెట్టి, సీనియర్ నాయకులు బాపురం శివమోహను రెడ్డి, యల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ

- నాలుగు నియోజకవర్గాలు మినహా సిట్టింగ్‌లకే సీట్లు
- కర్నూలు పార్లమెంట్‌కు బీవై రామయ్య, నంద్యాలకు పోచా బ్రహ్మానందరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ అభ్యర్థులను శనివారం వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. గత ఎన్నికలలో పోటీ చేసిన విజయం సాధించిన వారిలో కర్నూలు పార్లమెంట్, ఆలూరు, నందికొట్కూరు, కోడుమూరు, కర్నూలు, ఎమ్మిగనూరు మినగా మిగిలిన నియోజక వర్గాలో అందరూ పాతవారినే అధిష్టానం ఖరారు చేసింది. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా బీవై రామయ్య, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డిని ప్రకటించారు. అసెంబ్లీ అభ్యర్థులుగా అదోని వై సాయి ప్రసాద్‌రెడ్డి, ఆలూరు బి విరూపాక్షి, మంత్రాలయం వై.బాలనాగిరెడ్డి, ఎమ్మిగనూరు బుట్టారేణుక, పత్తికొండ కె శ్రీదేవి, కోడుమూరు అదిమూలపు సతీష్, కర్నూలు ఇంథియాజ్ అహ్మద్, డోన్ బుగ్గన రాజేంద్రనాద్‌రెడ్డి, పాణ్యం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నందికొట్కూరు ధారా సుధీర్, శ్రీశైలం శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల శిల్పా రవి, ఆళ్ళగడ్డ గంగుల బిజేంద్రనాద్‌రెడ్డి, బనగానపల్లె కాటసాని రామిరెడ్డిలను అభ్యర్థులుగా ప్రకటించారు. గత ఎన్నికలలోకర్నూలు పార్లమెంట్ నుండి పోటీ చేసి విజయం సాధి ంచిన డాక్టర్ సంజీవకుమార్ స్థానంలో ప్రస్తుతం కర్నూలు మేయర్ గా ఉన్న బీవై రామయ్యను కర్నూలు నుండి పోటీ చేసి విజయం సాధించిన హాఫీజ్ ఖాన్ స్థానంలో ఈసారి ఐఎఎస్ అధికారి ఇంథియాజ్‌అహ్మద్‌ను, ఎమ్మిగనూరు నుండి విజయం సాధించిన ఎర్రకోట చెన్నకేశరెడ్డి స్థానంలో మాజీ ఎంపీ బుట్టారేణుక, కోడుమూరు సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌బాబు స్థానంలో అదిమూలపు సతీష్, నందికొట్కూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఏపీఎస్ అధికారి ఆర్థర్ స్థానంలో డాక్టర్ సుధీర్ ధార, ఆలూరు సిట్టింట్ ఎమ్మెల్యే మంత్రి గుమ్మనూరు స్థానంలో బి.విరూపాక్షిని ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్ శనివారం ఎన్నికల కమీషన్ విడుదల చేయడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని స్థానాలల్లో వైసీపీ అభ్యర్థులను ప్రకటించడం విశేషం.

ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలుగా రాయలసీమ శకుంతల

విశాలాంధ్ర - కర్నూలు : ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలుగా రాయలసీమ శకుంతలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గోరంట్ల శకుంతల రాయలసీమ మహిళా సంఘ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వీటితోపాటు నిరాశ్రయ మహిళల కోసం వసతి గృహాన్ని ఏర్పాటు చేసి అనేక మంది వృద్ధ మహిళలకు, ఒంటరి మహిళలకు ఆశ్రయం కల్పిస్తూ వారి రక్షణకు తోడ్పాటునందిస్తారు. శంకుతల లోక్ అదాలత్ మెంబర్ , పోస్టల్ డిపార్ట్మెంట్లో ఆర్ఐసీసీ కమిటీ మెంబర్‌గా మహిళా సమస్యలపై కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాయలసీమ శకుంతల ను కర్నూలు సబ్ డివిజనల్ ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలుగా నియమించారు. శకుంతల నియామకంపట్ల పలు ప్రజా సంఘాలు, బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల సమయంలో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవ్ : సీఐ

విశాలాంధ్ర - దేవనకొండ : ఎన్నికల సమయంలో గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని దేవన కొండ సీఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలను భయభ్రాంతుకు గురిచేస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తేలేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పుడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మట్కా పేకాట, మద్యం వంటి వాటికి గ్రామ ప్రజలు దూరంగా ఉండాలన్నారు. గొడవలు సృష్టిస్తే రౌడీ షీట్ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చేస్తామని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందజేయాలి అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎండి ఉసేని, హెడ్ కానిస్టేబుల్స్, భాస్కర్, చెన్నయ్య, రాజు, కానిస్టేబుల్, దస్తగిరి, మహేష్, ఈశ్వర్, రంగన్న, నాయక్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతిని అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించక పోవడం బాధాకరమని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి.జి భరత్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరంలోని చిన్న అమ్మవారి శాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి టి.జి భరత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు కృషి, త్యాగం వల్లే తెలుగు మాట్లాడే వాళ్లమంతా కలిసి ఉన్నామన్నారు. ఆయన ఆంధ్రరాష్ట్ర సాధన కోసం జన్మించిన మహనీయుడని కొనియాడారు. ఈయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలన్నారు. రాబోయే టిడిపి, జనసేన, బీజేపీ ప్రభుత్వంలో ఇందుకోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు శేషగిరి శెట్టి, విఠల్ శెట్టి, మురళీ, నాగ వీరాంజనేయులు, చిన్న అమ్మవారి శాల సెక్రటరీ నంద కిషోర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో..

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక బి- క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్. నాగస్వామి నాయక్, అధ్యాపకులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని డిఈసి మెంబర్ ఎస్.పరమేశ్వర రెడ్డి అన్నారు. లెక్చరర్స్ విజయశేఖర్, నాగమోహన్, సోమేష్, పార్థసారథి పటేల్, జబీన్ అక్తర్, సుజాత, లక్ష్మి, గిరిజారాణి, మల్లేశ్వరుడు, ఉల్గోజి రావు, బాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోగిన ఎన్నికల నగారా

- ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఏప్రిల్ 18 నుండి 25 వరకు నామినేషన్
- మే 13 పోలింగ్
- జూన్ 4న లెక్కింపు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కేంద్ర ఎన్నికల కమీషన్ 18వ పార్లమెంట్, ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ మౌర్య తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ 7 విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నదని, ఏపీలో 4వ విడత పోలింగ్ జరనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 18 నుండి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమై 25 వరకు నామినేషన్ స్వీకరణ, 26 నామినేషన్ పరిశీలన, 29 వరకు నామినేషన్ ఉపసంహరణ జరుగుతుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న లెక్కింపు జరుగుతుందని తెలిపారు. షెడ్యూల్ విడుదల తరువాత నుండి 48 గంటల లోపు ప్రభుత్వస్థలాల్లో ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ ,రైల్వేస్టేషన్‌లతోపాట్లు పబ్లిక్ స్థలాల్లో కటౌట్‌లు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉంటే తొలగించడం జరుగుతుందన్నారు. పత్రికలలో రాజకీయ పార్టీల నేతల ప్రకటనలు ఇవ్వకూడదని, ఇస్తే అవి అభ్యర్థుల ఖర్చుల్లోకి వస్తాయన్నారు. జిల్లాలో మొత్తం 20,30,377 ఓట్లు ఉన్నాయని, ఇందులో పురుషులు 10,01,971, స్త్రీలు 10,28,096 ఓట్లు ఉన్నాయన్నారు. మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 2204 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఇందుకు 15,800 మంది సిబ్బందిని అవసరమైతారన్నారు2019 ఎన్నికలలో జిల్లాలో 76శాతం పోటింగ్ మాత్రమే జరిగిందని ఈ ఎన్నికలలో దీనిని మరింత పెంచేందుకు ముఖ్యంగా 83 నుండి 86శాతం కు పెరిగేందుకు కృషిచేస్తామన్నారు.గత ఎన్నికలలో తక్కువ పోలింగ్ జరిగిన కేంద్రాలపై దృష్టి కేంద్రీకరించి అక్కడ ఓటింగ్‌లో పాల్గొనేందుకు వారికి అవగాహన కల్పిస్తామన్నారు. ఎన్నికలలు ప్రశాంతంగా జరిగేందుకు, రీపోలింగ్ జరగకుండా చూసుకోవాలని ఎన్నికల కమీషన్ కోరిందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లా డుతూ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. ఇప్పటికే ఫారామిలిటరి పోలీసు లను రంగం లోకి దింపామ న్నారు. సమస్యా త్మక గ్రామాలను గుర్తించామన్నారు. తెలంగాణా, కర్నా టక బార్డర్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘట నలకు చోటు లేకుండా ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరిం చాలని కోరారు. ఈ సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

ఎన్నికల విధి నిర్వహణలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర -ఆదోని : ఎన్నికల విధి నిర్వహణలో ప్రతి ఒక్క అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదోని ఎన్నికల అధికారి/సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎంసిసిఎఫ్‌ఎస్‌టి, ఎస్ ఎస్ టి, టీములతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గం లో 256 పోలింగ్ కేంద్రాలలో 26 సెక్టారల్, రూట్ ఆఫీసర్లు, ఎన్నికలను సజావుగా నిర్వహిం చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిం చాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, వారిని జి.పి.ఎస్ ట్రాక్ సిస్టం ద్వారా నిరంతరాయంగా పరిశీలిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఎటువంటి సంఘట నలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, లిక్కర్ తదితర వస్తువులు పట్టుబడ్డ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ వీడియో రికార్డ్ తప్పని సరిగా చేయాలి తెలిపారు. రాజకీయ పార్టీల మీటింగ్స్, బ్యానర్లు మొదలైన సామాగ్రి పై వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు రికార్డు చేయాలని తెలిపారు. ఫ్లయింగ్ స్కాడ్ టీమ్ లు సీజ్ చేసిన నగదును కోర్టుకు సమర్పించాలని, ఎఫ్ఐఆర్ నమోదు కాని నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌కు సమర్పించాలని తెలిపారు. ఈ సెల్ తగిన ఆధారాలను పరిశీలించి నేరారోపణ లేకపోతే ఆ నగదును సంబంధిత వ్యక్తులకు అందజేస్తారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు 50 వేల లోపు నగదు మాత్రమే అనుమతి ఉన్నదని, 50వేలకు పైబడి ఉన్న నగదుకు సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ రామేశ్వర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జననేత పాలనలో రాష్ట్రం సుభిక్షం

విశాలాంధ్ర -ఆస్పరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలందరు సుభిక్షంగా ఉన్నారని ఆలూరు వైయస్సార్‌సీపీ అభ్యర్థి బూసేని విరుపాక్షి అన్నారు. శనివారం మండల పరిధిలోనే చిన్నహొతూరు గ్రామంలో విరుపాక్షి పర్యటించారు. ముందుగా సర్పంచ్ హరికృష్ణ, ఎంపీటీసీ మౌనిక, జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజుల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో బాణసంచా పేల్చి శాలువా పూల మాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోనే రోమన్ క్యాథలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, అలాగే సిద్ధ రామేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోనే ప్రధాన వీధుల గుండా పర్యటించి ప్రజలకు అభివాదం చేస్తూ వారితో ముచ్చ టించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి, జిల్లా కేడీసీసీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జడ్పిటిసి దొరబాబు, ఆస్పరి చిప్పగిరి మండలాల వైకాపా కన్వీనర్లు పెద్దయ్య, మారెయ్య, సింగిల్ విండో చైర్మన్ కట్టెల గోవర్ధన్, మాజీ చైర్మన్ కేశవరెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, వెంకటరెడ్డి, సర్పంచ్‌లు నెల్లూరప్ప, వెంక టేష్, ఎంపీ టీసీలు తిమ్మప్ప, శ్రీరాములు, పాండు, యువజన నాయకులు మసాల ప్రకాష్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమేప్రభుత్వ సంక్షేమం

విశాలాంధ్ర-కౌతాళం : రాష్ట్రంలోని ప్రతి మహిళ సంక్షేమంగా ఉన్ననాడు రాష్ట్ర ప్రభుత్వం క్షేమంగా ఉంటుందని వైఎస్ ఆర్సిపి జిల్లా కార్యదర్శి వై ప్రదీప్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కౌతాళంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత, ఆసరా పథకాలను ద్వారా మహిళాల ఖాతాలో నగదును రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు. విద్యార్థులకు అమ్మబడి, విద్యా దీవెన, విద్యా కానుక, మహిళలకు చేయూత, ఆసరా, రైతులకు రైతు భరోసా, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు చేతి వృత్తదాలకు ఆర్థిక సహాయం తదితర పథకాలతో ప్రతి ఒక్కరిని సంక్షేమ పథకం అందే విధంగా ముఖ్యమంత్రి కృషి చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల నాయకులు దాట్ల కృష్ణంరాజు, వీరసేనా రెడ్డి, ప్రహల్లాద చారి, అధ్యక్షులు అమరేష్, ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, అమ్మ సర్పంచ్ పాల్ దినాకర్, ఏకాంబర రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, దాట్ల సుబ్బరాజు, చౌదరి బసవరాజు, అవతారం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-కర్నూలు : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపర్ స్పెషాలిటీ విభాగం నందు శ్రీ సద్గురు దత్త కృపాలయం స్వామి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు చలివేంద్రాల్ని ప్రారంభించినట్టు అడిషనల్ డీఎంఈ, సూపరింటెండెంట్, డా.వి.వెంకటరంగా రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలోని శ్రీసద్గురు దత్త కృపాలయం వారు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు. గత 20 ఏళ్ల నుండి పేషెంట్లకు ఎన్నో సేవలందిస్తున్నారు. ప్రతిరోజు పేషెంట్లకు మధ్యాహ్న భోజనం దాదాపు 1000 మంది వరకూ రుచికరమైన నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. పలు సేవలు చేస్తున్నందుకు వారికి ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. శ్రీ సద్గురు దత్త కృపాలయం వారికి ఇలాంటి ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. ఎండ కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వచ్చినందుకు భినందించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. శ్రీ సద్గురు దత్త కృపాలయం సిబ్బంది ప్రెసిడెంట్, మల్లారెడ్డి, సెక్రెటరీ, శ్రీధర్ గుప్తా, పాల్గొన్నారు.

అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. శనివారం స్థానిక చిల్డ్రన్స్ పార్క్ లోని అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన పూలమాలలు వేసి నివాళులర్పించినారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిదన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు పొట్టిశ్రీరాములు చేసిన కృషి చిరస్మరణీయం అని జిల్లా కలెక్టర్ కొనియాడారు. ఆయన చేసిన త్యాగం, పోరాటం నేటి యువతకు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న జన్మించి 1952 డిసెంబరు15న అమరులయ్యారని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషడని ఆయన త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం 1956 నవంబర్1న ఏర్పడిం దని అన్నారు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడని, తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సర కాలంలో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించాడని అన్నారు. ఆంధ్రులకు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైనవారని, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకట లక్ష్మమ్మ, చిల్డ్రన్స్ పార్క్ ఎండి ప్రశాంతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా

విశాలాంధ్ర - హొళగుంద : ప్రభుత్వ జూనియర్ కాలేజీ నూతన ప్రిన్సిపల్‌గా కే ప్రవీణ శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. 2021 నుండి ఖాళీగా ఉన్న రెగ్యులర్ ప్రిన్సిపాల్ సీటును ప్రవీణ అలంకరించారు. కర్నూలు టౌన్ మోడల్ కాలేజీలో బోటనీ లెక్చరర్‌గా పని చేస్తూ ప్రమోషన్ పై రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా ఇక్కడికి వచ్చారు. నూతన ప్రిన్సిపల్ కు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డేవిడ్ సిబ్బంది శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి విద్యా సమస్యల పరికరానికి కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రానికి మండల కేంద్రం చాలా దూరంగా ఉన్నదని రోడ్లు సక్రమంగలేవన్నారు. కాలేజీ సిబ్బందితో కాలేజీ సమస్యలపై చర్చించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : బుట్టారేణుక

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : ముఖ్యమంత్రి జగనన్నతోనే అభివృద్ధితో పాటు సంక్షేమ పాలన సాధ్యమని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని మునిసిపల్ వైస్ చైర్మన్, 11 వార్డు కౌన్సిలర్ నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో వైసిపి గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న బుట్టారేణుకను వార్డు ప్రజలు పూలమాలలతో ఘనంగా ఆహ్వానించారు. ప్రజలు వాడవాడనా ఎదురేగి స్వాగతం పలికారు. బుట్టారేణుక ఇంటింటికి తిరుగుతూ జగనన్న పాలన గూర్చి వివరించారు. గడప వద్దకే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కుతుందని, దీంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని లబ్ది దారులు అన్నారు. అనంతరం బుట్టా రేణుక మాట్లాడుతూ..ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా తమకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా మీకు అందరికీ తోడు నీడగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి బాసటగా నిలవాలని, ఆయనకు అందరి దీవెనలు, ఆశీర్వాదాలు అందచేయాలని, మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డిని చేయాలని కోరారు. కార్యక్రమంలో బుట్టా నీలకంఠ, మునిసిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, నాయకులు బుట్టారంగయ్య, రియాజ్ అహమ్మద్, రాజారత్నం, సుధాకర్, గురవయ్య, రసూల్, మబ్బాష, వినయ్, సూరి, అబ్రర్, సోమేష్, బజారి, ప్రతాప్ రెడ్డి, హయాత్ అలి, గట్టు ఖాజా, చాంద్, రఫిక్, ఫరూక్, రహంతుల్లా బాష, వలి, మహబూబ్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

భద్రత రూమును పరిశీలించిన ఎంఈవో

విశాలాంధ్ర - కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో పదవ తరగతి ప్రశ్న పత్రాల భద్రత రూమును ఎంఈఓ శ్రీనివాసులు ఎస్సై నరేష్ లు పరిశీలించారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని పదవ తరగతి పరీక్షలు నిర్వహించే కేంద్రాలను ఎస్సై నరేష్ ఎంఈఓ శ్రీనివాసులు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18 నుంచి నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. 18 సెంటర్లలోనే సౌకర్యాలు డెస్కు మరుగుదొడ్లు నీటి వసతులపై తనిఖీ చేయడం జరిగిందన్నారు.

ప్రాక్టికల్ పరిజ్ఞానంతో ఉన్నతంగా రాణించొచ్చు

విశాలాంధ్ర - ఎడ్యుకేషన్ : ఇంజనీరింగ్ విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్స్ పరిజ్ఞానాన్ని పెంచుకున్నప్పుడే ఉన్నంతంగా రాణిస్తారని రాయల సీమ విశ్వవిద్యాలయ వైశాల్ ఆచార్య బి సుదీర్ ప్రేమ కుమార్ అన్నారు. శనివారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ సిల్క్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో మైక్రోసాఫ్ట్, ఎస్ఏపీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం కింద ఎడ్యునైట్ ఫౌండేషన్ వారి టేక్ సి సాక్ష్మ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద వెనుకబడిన ప్రాంతమైన కర్నూలు జిల్లాను పెంచుకొని ఇక్కడ విద్యార్థులకు అధునాతన అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టునైట్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హరి ప్రసాద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సందీప్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా శ్రీదేవి

విశాలాంధ్ర-పత్తికొండ: పత్తికొండ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కంగాటి శ్రీదేవి పేరును అధిష్టానం ప్రకటించడంతో వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కోఆప్షన్ సభ్యులు కారుమంచి నజీర్ మాట్లాడుతూ గత పాలకులు పత్తికొండ నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేసింది లేదన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి హయాంలో పత్తికొండ నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుతో పాటు, అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో మరోసారి ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నాలుగు స్తంభాల మండపం దగ్గర బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

ఆదోని అసెంబ్లీ స్థానం నుండి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఐదోసారి పోటీ

విశాలాంధ్ర - ఆదోని : రాజకీయ కుటుంబం నుండి రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న ఆదోని వైసీపీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆదోని అసెంబ్లీ నుండి 5వ సారి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు. శనివారం సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదోని అసెంబ్లీ అభ్యర్థిగా సాయి ప్రసాద్ రెడ్డి పేరును ప్రకటించారు. ఇప్పటివరకు ఆదోని నియోజకవర్గం లో 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా 2024 లో జరిగే ఎన్నికలు 15వ సారి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. 2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందారు, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా పార్టీ తరఫున గెలుపొందగా, 2009 ఎన్నికల్లో స్వల్ప మెజార్టీ ఓటుతో ఓటమిపాలయ్యారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో ఐదోసారి ఎమ్మెల్యే పూర్తిగా సాయిప్రసాద్ రెడ్డి పోటీ చేయనున్నారు.

మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

విశాలాంధ్ర -ఆస్పరి : రాష్ట్రంలో ఉన్న మాలలకు అన్ని రాజకీయ పార్టీలు జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పుష్పాంజలి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ హాస్టల్ ఆవరణంలో ఆలూరు ఎంపీపీ తనయుడు జట్టప్ప వీరేష్ అధ్యక్షతన మాలల మహా గర్జనను నిర్వహించారు. ఈ మహాగర్జనకు ముఖ్య అతిథులుగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పుష్పాంజలి పాల్గొని మాట్లాడుతూ మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి మాలలు రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. మాలలు ఆర్థికంగా ఎదగాలంటే వారి పిల్లలను బాగా చదివించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల కన్వీనర్ భరత్, నాయకులు మానయ్య, వీరభద్ర, నాగరాజు, లక్ష్మీనారాయణ, వెంకట్ రాముడు, నాగూరు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికే వైసీపీ మొదటి ప్రాధాన్యత



విశాలాంధ్ర-వెల్దుర్తి : రాష్ట్రాభివృద్ధికే మొదటి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వంగా వైయస్ఆర్ సిపి నిలిచిందని, గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి సంక్షేమ పనులు ఐదేళ్ళ కాలంలోనేపూరి చేయడం ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికే సాధ్యమని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలో రూ.4.83 కోట్లతో బీటిరోడ్లు, జులజీవన్ మిషన్ కింద పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై ఉన్నఅముకతాడు టోల్ గేట్ సమీపం నుండి గుంటుపల్లి గ్రామానికి రూ.1.45కోట్లతోపూర్తి చేసిన బీటీ రోడ్డును, రూ.30లక్షలతో పూర్తి చేసిన జలజీవన్ మిషన్ పథకంకింద ఇంటింటి కి కొళాయి పనులను, గోవర్ధనగిరి గ్రామం నుండి శ్రీరంగాపురంమీదుగా లక్ష్మిపల్లి గ్రామానికి రూ.3.08 కోట్లతో పూర్తి చేసిన బీటి రోడ్లను(తారురోడ్డు) ఎమ్మెల్యే కె. శ్రీదేవమ్మ చేతుల మీదుగా అధికారులు, గ్రామవైకాపా నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూశ్రీరంగాపురం, లక్ష్మిపల్లి గ్రామాలకు రోడ్డు వేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని,ప్రతి పల్లెని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ధ్యేయమని, తన భర్తచెరుకులపాడు నారాయణ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సుదేపల్లె వెంకటేశ్వర్ రెడ్డి, గుంటుపల్లి జనార్దన్ రెడ్డి, గుంటుపల్లి, శ్రీరంగాపురం గ్రామాల వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 24 పార్లమెంటు నియోజక వర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గానికి మాత్రం అభ్యర్థిని ఖరారు చేయలేదు. శనివారం ఇడుపుల పాయలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం అక్కడ నుంచే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను సీఎం జగన్ ప్రకటించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు అభ్యర్థుల పేర్లను చదివి వినిపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం సీట్లు కేటాయించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే అభ్యర్థులు

శ్రీకాకుళం - ధర్మాన ప్రసాదరావు
ఆమదాల వలస - తమ్మినేని సీతారాం
పాతపట్నం -రెడ్డి శాంతి
నరసన్న పేట - ధర్మాన కృష్ణదాస్
టెక్కలి - దువ్వాడ శ్రీనివాస్
ఇచ్ఛాపురం - పిరియా విజయ
పలాస - సీదిరి అప్పలరాజు
రాజాం (ఎస్సీ) - తలే రాజేశ్
విజయనగరం - కోలగట్ల వీరభద్రస్వామి
బొబ్బిలి- సంబంగి వెంకట చిన అప్పల నాయుడు
గజపతి నగరం- బొత్స అప్పల నర్సయ్య
చీపురుపల్లి- బొత్స సత్యనారాయణ
నెల్లిమర్ల -బడ్డు కొండ అప్పల నాయుడు
ఎచ్చెర్ల- గొర్లె కిరణ్‌కుమార్
గాజువాక - గుడివాడ అమర్‌నాథ్
విశాఖ (దక్షిణం) - వాసుపల్లి గణేశ్
విశాఖ (ఉత్తరం) - కేకే రాజు
భీమిలి - ముత్తంశెట్టి శ్రీనివాసరావు
విశాఖ (తూర్పు) - ఎంవీవీ సత్యనారాయణ
విశాఖ (పశ్చిమ) - అడారి ఆనంద్
శృంగవరపుకోట - కడుబండి శ్రీనివాసరావు
పెందుర్తి - అన్నంరెడ్డి అదీప్‌రాజ్
పాయకరావుపేట (ఎస్సీ) - కంబాల జోగులు
చోడవరం - కరణం ధర్మశ్రీ
నర్సీపట్నం - పెట్ల ఉమాశంకర్ గణేశ్
అనకాపల్లి - మలసాల భరత్‌కుమార్
మాడుగుల - బూడి ముత్యాల నాయుడు
ఎలమంచిలి - ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు (కన్నబాబు రాజు)
అరకు (ఎస్టీ) - రేగం మత్స్యలింగం
పాడేరు (ఎస్టీ) - మత్స్యరస విశ్వేశ్వరరాజు
రంపచోడవరం (ఎస్టీ) - నాగులపల్లి ధనలక్ష్మి
పార్వతీపురం (ఎస్సీ) - అలజంగి జోగారావు
కురుపాం (ఎస్టీ) - పాముల పుష్పశ్రీవాణి
సాలూరు (ఎస్టీ) - పీడిక రాజన్నదొర
పాలకొండ (ఎస్టీ) - విశ్వాసరాయి కళావతి
ప్రత్తిపాడు - వరుపుల సుబ్బారావు
జగ్గంపేట- తోట నరసింహం, తుని- దాడిశెట్టి రాజా
పిఠాపురం- వంగా గీత
కాకినాడ సిటీ - ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
కాకినాడ రూరల్ - కురసాల కన్నబాబు
పెద్దాపురం- దవులూరి దొరబాబు
రాజోలు (ఎస్సీ) - గొల్లపల్లి సూర్యారావు
కొత్తపేట - చిర్ల జగ్గిరెడ్డి
ముమ్మిడివరం - పొన్నాడ వెంకట సతీశ్ కుమార్
రామచంద్రపురం - పిల్లి సూర్య ప్రకాశ్
అమలాపురం (ఎస్సీ) - పినిపే విశ్వరూప్
పి.గన్నవరం - విప్పర్తి వేణుగోపాల్
మండపేట - తోట త్రిమూర్తులు
అనపర్తి - సత్య సూర్యనారాయణ రెడ్డి
గోపాలపురం (ఎస్సీ) - తానేటి వనిత
రాజానగరం - జక్కంపూడి రాజా
నిడదవోలు - గెద్దం శ్రీనివాసనాయుడు
రాజమండ్రి సిటీ - మార్గాని భరత్‌రామ్
రాజమండ్రి రూరల్ - చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ
కొవ్వూరు (ఎస్సీ) - తలారి వెంకటరావు
నరసాపురం - ముదునూరి నాగరాజ వరప్రసాదరాజు
భీమవరం - గ్రంథి శ్రీనివాస్
ఆచంట - చెరుకువాడ శ్రీరంగనాథ రాజు
తణుకు - కారుమూరి వెంకట నాగేశ్వరరావు
ఉండి - పీవీఎల్ నరసింహరాజు
తాడేపల్లిగూడెం - కొట్టు సత్యనారాయణ
పాలకొల్లు - గూడాల శ్రీహరి గోపాలరావు
చింతలపూడి (ఎస్సీ) - కంభం విజయరాజు
నూజివీడు - మేకా వెంకట ప్రతాప అప్పారావు
దెందులూరు - కొఠారు అబ్బయ్య చౌదరి
కైకలూరు - దూలం నాగేశ్వరరావు
పోలవరం (ఎస్టీ) - తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు - ఆళ్ల నాని
ఉంగుటూరు - పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు)
పామర్రు (ఎస్సీ) - కైలే అనిల్ కుమార్
అవనిగడ్డ - సింహాద్రి రమేశ్ బాబు
మచిలీపట్నం - పేర్ని సాయికృష్ణ మూర్తి (కిట్టు)
పెడన - ఉప్పాల రమేశ్, గుడివాడ - కొడాలి నాని
గన్నవరం - వల్లభనేని వంశీ మోహన్
పెనమలూరు - జోగి రమేశ్
నందిగామ (ఎస్సీ) - మొండితోక జగన్మోహనరావు
తిరువూరు (ఎస్సీ) - స్వామిదాస్
విజయవాడ ఈస్ట్ - దేవినేని అవినాశ్
విజయవాడ వెస్ట్ - షేక్ ఆసిఫ్
విజయవాడ సెంట్రల్ - వెలంపల్లి శ్రీనివాస్
జగ్గయ్యపేట - సామినేని ఉదయభాను
మైలవరం - సర్నాల తిరుపతి రావు
తాడికొండ (ఎస్సీ) - మేకతోటి సుచరిత
ప్రత్తిపాడు (ఎస్సీ) - బాలసాని కిరణ్‌కుమార్
తెనాలి - అన్నాబత్తుని శివకుమార్
పొన్నూరు - అంబటి మురళి
గుంటూరు వెస్ట్ - విడదల రజని
మంగళగిరి - మురుగుడు లావణ్య
గుంటూరు ఈస్ట్ - షేక్ నూర్ ఫాతిమా
పెద్దకూరపాడు - నంబూరు శంకర్రావు
వినుకొండ - బొల్లా బ్రహ్మయ్యనాయుడు
సత్తెనపల్లి - అంబటి రాంబాబు, గురజాల - కాసు మహేశ్ రెడ్డి
చిలకలూరిపేట - కావటి శివనాగ మనోహర్‌నాయుడు
నరసరావుపేట - గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
మాచర్ల - పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
రేపల్లె - రేవూరి గణేశ్, బాపట్ల - కోన రఘుపతి
వేమూరు(ఎస్సీ) - వరికూటి అశోక్ బాబు
సంతనూతలపాడు (ఎస్సీ) - మేరుగ నాగార్జున
అద్దంకి - పాణెం చిన్న హనిమిరెడ్డి
పర్చూరు - ఎడం బాలాజీ, చీరాల - కరణం వెంకటేశ్
దర్శి - డా॥ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి
యర్రగొండపాలెం (ఎస్సీ) - తాటిపర్తి చంద్రశేఖర్
గిద్దలూరు - కుందూరు నాగార్జునరెడ్డి
ఒంగోలు - బాలినేని శ్రీనివాసరెడ్డి (వాసు)
కొండపి (ఎస్సీ) - ఆదిమూలపు సురేశ్
కనిగిరి - దద్దాల నారాయణయాదవ్, మార్కాపురం - అన్నా రాంబాబు
కందుకూరు - బుర్రా మధుసూదన్ యాదవ్
కావలి - రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి
కోవూరు - నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి
నెల్లూరు సిటీ - మహమ్మద్ ఖలీల్ అహ్మద్
నెల్లూరు రూరల్ - ఆదాల ప్రభాకర్ రెడ్డి
ఉదయగిరి - మేకపాటి రాజగోపాల్ రెడ్డి
ఆత్మకూరు - మేకపాటి విక్రమ్ రెడ్డి, సర్వేపల్లి - కాకాని గోవర్ధన్ రెడ్డి
గూడూరు(ఎస్సీ) - మేరిగ మురళీధర్
శ్రీకాళహస్తి - బియ్యపు మధుసూదన్‌రెడ్డి
సూళ్లూరుపేట (ఎస్సీ) - కిలివేటి సంజీవయ్య
వెంకటగిరి - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
తిరుపతి - భూమన అభినయ్‌రెడ్డి, సత్యవేడు - నూకతోటి రాజేశ్
కుప్పం - కేజే భరత్, పలమనేరు - ఎన్.వెంకట్ గౌడ
చంద్రగిరి - చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
గంగాధర నెల్లూరు (ఎస్సీ) - కలతూరు కృపాలక్ష్మి
నగరి - ఆర్‌కే రోజా, పూతలపట్టు - డాక్టర్ సునీల్‌కుమార్
చిత్తూరు - ఎం. విజయానందరెడ్డి
మదనపల్లె- నిషార్ అహ్మద్
పుంగనూరు - పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
పీలేరు - చింతల రామచంద్రారెడ్డి
తంబళ్లపల్లె - పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి
రాజంపేట - ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
కోడూరు (ఎస్సీ) - కె.శ్రీనివాసులు
రాయచోటి - గడికోట శ్రీకాంత్‌రెడ్డి
జమ్మలమడుగు - మూలే సుధీర్‌రెడ్డి
కడప - అంజద్‌బాషా
బద్వేలు (ఎస్సీ) - దాసరి సుధ
పులివెందుల - వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
కమలాపురం - రవీంద్రనాథ్‌రెడ్డి
మైదుకూరు - రఘురామిరెడ్డి
ప్రొద్దుటూరు - రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి
కోడుమూరు (ఎస్సీ) - ఆదిమూలపు సతీశ్
ఆదోని - వై.సాయి ప్రసాద్‌రెడ్డి
కర్నూలు - ఎండీ ఇంతియాజ్
మంత్రాలయం - వై. బాలనాగిరెడ్డి
ఎమ్మిగనూరు - బుట్టారేణుక
పత్తికొండ - కంగాటి శ్రీదేవి
ఆలూరు - బి. విరూపాక్షి
నందికొట్కూరు (ఎస్సీ) - డాక్టర్ దారా సుధీర్
బనగానపల్లి - కాటసాని రామిరెడ్డి
ఆళ్లగడ్డ - గంగుల బ్రిజేంద్రరెడ్డి (నాని)
శ్రీశైలం - శిల్పా చక్రపాణిరెడ్డి
నంద్యాల - శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
పాణ్యం - కాటసాని రాంభూపాల్‌రెడ్డి
డోన్ - బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
కదిరి - బీఎస్ మక్బూల్ అహ్మద్
పుట్టపర్తి - దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
హిందూపురం - టీఎన్. దీపిక
ధర్మవరం - కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి
పెనుకొండ - కేవీ ఉషశ్రీ చరణ్
మడకశిర - ఈర లక్కప్ప, రాప్తాడు - తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి
శింగనమల (ఎస్సీ) - మన్నెపాకుల వీరాంజనేయులు
తాడిపత్రి - కేతిరెడ్డి పెద్దారెడ్డి
అనంతపురం అర్బన్ - అనంత వెంకటరామిరెడ్డి
గుంతకల్లు - వై. వెంకటరామిరెడ్డి
ఉరవకొండ - వై. విశ్వేశ్వరరెడ్డి
కల్యాణదుర్గం - తలారి రంగయ్య
రాయదుర్గం - మెట్టు గోవిందరెడ్డి

ఎంపీ అభ్యర్థులు

అరకు - తనూజ రాణి
శ్రీకాకుళం - పేరాడ తిలక్
విజయనగరం - బెల్లాన చంద్రశేఖర్
విశాఖపట్నం - బొత్స ఝాన్సీ
కాకినాడ - చలమలశెట్టి సునీల్
అమలాపురం - రాపాక వరప్రసాద్
రాజమండ్రి - గూడూరు శ్రీనివాసరావు
నరసాపురం - ఉమాబాల
ఏలూరు - కారుమూరి సునీల్‌కుమార్
మచిలీపట్నం - సింహాద్రి చంద్రశేఖరరావు
విజయవాడ - కేశినేని శ్రీనివాస్
గుంటూరు - కిలారి వెంకట రోశయ్య
నరసరావుపేట - పోలుబోయిన అనిల్‌కుమార్
బాపట్ల - నందిగం సురేశ్
ఒంగోలు - చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
నంద్యాల - పోచా బ్రహ్మనందరెడ్డి
కర్నూలు - బీవై రామయ్య
అనంతపురం - మాలగుండ్ల శంకర నారాయణ
హిందూపురం - జోళదరాశి శాంత
కడప - వైఎస్ అవినాశ్ రెడ్డి
నెల్లూరు - విజయసాయి రెడ్డి
తిరుపతి - మద్దిల గురుమూర్తి
రాజంపేట - పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
చిత్తూరు - ఎన్ రెడ్డప్ప

ఎన్నికలకు ఇండియా సిద్ధం

- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు ఇదే చివరి అవకాశం
- విద్వేషం, నిరుద్యోగం, అధిక ధరలపై ఐక్యంగా పోరాడదాం
- నిరంకుశ పాలనకు అంతం పలుకుదాం
- ఎన్నికల షెడ్యూల్‌ను స్వాగతిస్తున్నాం: కాంగ్రెస్, ఆప్



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు ప్రతిపక్ష కూటమి ఇండియా సిద్ధంగా ఉన్నదని, పూర్తి మెజారిటీ సాధించేందుకు నడుం బిగించిందని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించాయి. దేశాన్ని నిరంకుశత్వం నుంచి కాపాడుకునేందుకు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ఇదే చివరి అవకాశమని లోక్‌సభ ఎన్నికలనుద్దేశించి ఉద్ఘాటించాయి. నియంత పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చాయి. లోక్‌సభ ఎన్నికలల్లో పూర్తి మెజారిటీ సాధించేందుకు ఇండియా కూటమి సిద్ధంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రతినిధి గోపాల్ రాయ్ ప్రకటించారు. ఎన్నికల తేదీలపై ఎన్నికల సంఘం ప్రకటనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. విద్వేషం, నిరుద్యోగం, అధిక ధరలపై పోరునకు పౌరులంతా ఏకం కావాలని మల్లికార్జున ఖర్గే కోరారు. గత పదేళ్లలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసి రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడిన మోదీ పాలన నుంచి విముక్తి కోసం దేశ ప్రజలు ఈ ఎన్నికల కోసం నిరీక్షిస్తున్నారని రాయ్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలతోనే భారత్‌కు 'న్యాయం' కోసం ద్వారాలు తెరుచుకుంటాయని చెప్పారు. హాత్ బదలేగా హాలాత్ ('చెయ్యి'తో పరిస్థితిలో మార్పు) అని 'హస్తం' గుర్తునుద్దేశించి ఖర్గే అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన క్రమంలో ఆయన 'ఎక్స్' మాధ్యమంగా ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎన్నికలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందా లేదా అన్నది తేలనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడతారా లేక ఒక వ్యక్తి ఆశలు, ఆకాంక్షలాధారంగా ప్రజాస్వామ్య భవితవ్యం నిర్ణయమవుతుందా అన్నది స్పష్టమవుతుందన్నారు. ఎన్నికల బాండ్లు, నిర్బంధాలు, సస్పెన్షన్లు, విపక్ష పార్టీలు, రాజకీయ నాయకులపై దాడులు, ప్రధాన ప్రతిపక్ష పార్టీ నిధులు ఫ్రీజ్ చేయడం వంటి అసాధారణ పరిణామాల నడుమ కుంభకోణాల నీడలో 'మైలురాయి' ఎన్నికలు జరనున్నాయన్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంబద్ధ హోదాను బీజేపీ తగ్గించిందని, ఎన్నికల కమిషనర్ల నియామకంపై కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తం చేసిందని చెప్పారు. రైతులు, యువత, మహిళలు ముఖ్యంగా నిరుద్యోగుల సమస్యలను భారత్ జోడో రెండు యాత్రల్లో ప్రముఖంగా ప్రస్తావించామన్నారు. యువత కోసం ఆలోచించే పార్టీని ఎన్నుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. 30లక్షల ఉద్యోగాల హామీ... పేపర్ లీక్‌ల కట్టడికి కఠిన చట్టాలు తేవడం వంటి హామీలతో దేశంలో రాజకీయాల తీరు మారిందని, ఈ సమస్యలను ఏ పార్టీ నిర్లక్ష్యం చేయలేదన్నారు. 18 మిలియన్ల మంది కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారని, యువతకు ఓటు హక్కు కల్పించిన రాజీవ్ గాంధీని స్మరించుకుంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారని ఖేరా అన్నారు. బీజేపీ నినాదాలు కేవలం బీజేపీ ప్రయోజనాలకే పరిమితమని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇచ్చిన హామీలు దేశానికి, దేశ ప్రజల హితవు కోసమని నొక్కిచెప్పారు. రాగల రెండు నెలల్లో నిరంకుశ బీజేపీ, ప్రధాని నుంచి దేశం విముక్తి పొందబోతోందని పవన్ ఖేరా ఉద్ఘాటించారు. మరోవైపు ఆప్ ఢిల్లీ శాఖ కన్వీనర్ గోపాల్ రాయ్ వేరుగా విలేకరులతో మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా బీజేపీ పదేళ్ల పాలన సాగిందన్నారు. బీజేపీ పాలనలో అనుభవించిన బాధను వ్యక్తం చేసేందుకు ప్రజలు ఇదే అవకాశమని, అందుకోసమే వారంతా ఈ ఎన్నికల కోసం వేచివున్నారని వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి ప్రచారాన్ని ఏకీకృతం చేసేందుకు దోహదమయ్యేలా తమ అభ్యర్థులను కాంగ్రెస్ త్వరగా ప్రకటించాలని రాయ్ సూచించారు. ఢిల్లీలో మే 25న ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే బీజేపీ ఏడు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది.

అఖండ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి బీజేపీ: నడ్డా

వచ్చే ఐదేళ్ల కోసం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని, మోదీ నాయకత్వంలో అఖండ మెజారిటీతో మరోమారు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా దీమాగా చెప్పారు. ఎన్నికల షెడ్యూల్‌ను స్వాగతిస్తున్నామన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేసేందుకు ముందుకు రావాలని, ప్రతి ఒకరు ఓటు వేయాలని 'ఎక్స్' ద్వారా పిలుపునిచ్చారు. బీజేపీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ 'ఎన్నికల ప్రకటన వెలువడింది. దేశంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చర్యలు మొదలయ్యాయి' అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే వైభవంగా ఎన్నికల ఉత్సవం భారత్‌లో జరగనున్నదని, ఇందులో ఉత్సాహంగా పాల్గొనాలని ఓటర్లను కోరారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తాం

- జూనియర్ న్యాయవాదులకు రూ.7 వేల గౌరవ వేతనం
- రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్
- లీగస్ సెల్ సదస్సులో చంద్రబాబు హామీ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఉన్మాదుల నుండి స్వాతంత్ర్యం వచ్చినంత ఆనందంగా ప్రజలు పండుగ చేసుకుంటున్నారని, ఎన్నికల్లో జగన్‌కు దిమ్మతిరిగే ఫలితం రాబోతోందని అన్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పేరుతో నెలకు రూ.7 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. లా నేస్తం పేరుతో జగన్ కేవలం 2,670 మందికే గౌరవ వేతనం ఇచ్చారని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ సంఖ్యను 3,500దాకా పెంచుతామని భరోసా ఇచ్చారు. లాయర్లకు కార్పస్ ఫండ్ కింద రూ.100 కోట్లు కేటాయిస్తామన్నారు. విజయవాడ లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో టీడీపీ లీగస్ సెల్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల సమ్మిట్‌లో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా లీగల్ సెల్ వర్క్‌షాప్‌లు పెట్టుకోవాల్సి వస్తోంది. నా నామినేషన్‌ను కార్యకర్తలు, న్యాయవాదులే వేసేవారు. కేవలం డిక్లరేషన్ పత్రంపైనే నేను సంతకం చేసేవాడిని. కానీ నేడు నాపై ఎన్నికేసులు ఉన్నాయో ముందుగానే డీజీపీని, అధికారులను లేఖల ద్వారా అడిగే పరిస్థితి నెలకొంది. అడగకపోతే ఎప్పుడు దొంగ కేసులు పెట్టారో తెలియదు. నామినేషన్ వేయాలనుకునే ప్రతి అభ్యర్థి తనపై ఎన్ని కేసులు ఎన్నాయో చెప్పండి అని అడుక్కునే దుస్థితి. రాజ్యాంగంలో శాసన, కార్యనిర్వాహక, మీడియా ప్రధానమైనవి. ఇవి గాడి తప్పితే మళ్లీ గాడిలో పెట్టేది న్యాయ వ్యవస్థే. న్యాయ వ్యవస్థ లేకపోతే మనం ఇక్కడ ఉండేవాళ్లం కాదు. నాతో పాటు మా లాయర్లు కూడా నిద్రలేని రాత్రులు గడిపారు. నా జీవితంలో లాయర్లపై దాడులు చేయడం ఇప్పుడే చూస్తున్నాను. వారే కోర్టుకు వెళ్లి దాడులు జరుగుతున్నాయని చెప్పుకునే పరిస్థితి దాపురించింది. ఎన్నికల కమిషర్‌కు కూడా దిక్కులేదు. రక్షణ కోసం కేంద్ర సాయం కోరే పరిస్థితి ఏర్పడింది. ప్రజలు గెలవాలి...రాష్ట్రం నిలవాలి అన్న నినాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ ముందుకు వెళుతున్నాయి. ఆదివారం ప్రధానితో ప్రజాగళం సభను చిలకలూరిపేటలో నిర్వహిస్తున్నాం. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు రాబోతున్నాయి. కేంద్రంలో 400 లోక్‌సభ సీట్లతో ఎన్డీయే, రాష్ట్రంలో ఎప్పుడూ లేని మెజారిటీతో టీడీపీ కూటమి గెలవబోతుంది' అని చంద్రబాబు చెప్పారు. లాయర్లకు స్వర్ణయుగం చూపించే పాలన తీసుకొస్తాం. రూ.5 లక్షల దాకా మెడికల్ క్లెయిమ్, రూ.15 లక్షల ప్రమాద బీమాకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించే బాధ్యత తీసుకుంటాం. న్యాయం కోసం పోరాడే మీకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఎన్నికల కోడ్ వచ్చింది. కాలర్ ఎగరేసుకుని ఇక బయటకు రండి. రాష్ట్రాన్ని కాపాడటానికి న్యాయవాదులు ప్రధాన బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

రేపటి నుంచి పది పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 18న ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్ ఏ, ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ 1 (కంపొజిట్ కోర్స్), 19న సెకండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీషు, 22న మేథమేటిక్స్, 23న ఫిజికల్ సైన్సెస్, 26న బయలాజికల్ సైన్స్, 27న సోషల్‌స్టడీ పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. 28 నుంచి 30 వరకు ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధంచేసింది. నెల రోజుల క్రితమే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి వారికి తగిన సూచనలిచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఎన్నికల్లోపే అన్ని పరీక్షలను పూర్తి చేసే దిశగా ప్రభుత్వం సిద్ధమైంది. విద్యార్థుల చదువులపై ఎన్నికల ప్రభావం పడకుండా చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకిగాను ఏపీ టెట్, డీఎస్సీ షెడ్యూలు కూడా జారీజేసింది. టెట్ పరీక్షలు పూర్తికాగా, డీఎస్సీ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు ఉన్నత విద్యామండలి షెడ్యూలు జారీజేసింది.

మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం వద్దు

పాక్‌పై భారత్ ఆగ్రహం

ఐరాస: అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ తీరును భారత్ ఎండగట్టింది. చెప్పిందే చెప్పే చెత్త రికార్డు ఆ దేశం సొంతమని మండిపడింది. ఐరాస జనరల్ అసెంబ్లీలో అయోధ్య రామాలయం, సీఏఏ గురించి ఆ దేశ రాయబారి లేవనెత్తడంపై భారత్ ఘాటుగా స్పందించింది. యూఎన్‌జీఏలో జరిగిన ప్లీనరీ సమావేశంలో పాకిస్థాన్ రాయబారి మునీర్ అక్రమ్ మాట్లాడుతూ అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ, ఇటీవల అమల్లోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) గురించి ప్రస్తావించారు. దీనిపై ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ స్పందించారు. 'నా దేశానికి సంబంధించిన విషయాలపై ఈ ప్రతినిధి బృందం సంకుచిత, తప్పుదోవ పట్టించే దృక్పథాన్ని కలిగిఉండటం దురదృష్టకరం. జనరల్ అసెంబ్లీ అంతర్జాతీయస్థాయి కలిగిన లోతైన అంశాల గురించి పరిగణిస్తుంటే... మీ దగ్గర నుంచి భిన్నమైన వైఖరి కనిపిస్తోంది. ఎప్పుడూ చెప్పిందే చెప్పే చెత్త రికార్డు కలిగిన ఆ దేశ ప్రతినిధి బృందం... ప్రపంచం పురోగమిస్తోన్న తరుణంలో స్తబ్దుగా ఉండటం విచారకరం' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది జనవరిలో అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం జరిగింది. మరోవైపు రెండురోజుల క్రితం సీఏఏ విధివిధానాలపై కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం మన పౌరసత్వం ఇచ్చేందుకు వీలుగా కేంద్రం సీఏఏ–2019ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కొద్దిరోజుల క్రితం కూడా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాక్‌కు మనదేశం గట్టిగా బుద్ధి చెప్పింది. ఉగ్రవాదులతో పారిన రక్తంతో వారి చేతులు తడిసిపోయాయని న్యూఢిల్లీ మండిపడింది. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు పాక్‌కు లేదని మరోసారి గట్టిగా హెచ్చరించింది.

నేడు ముంబైలో రాహుల్ న్యాయ సంకల్ప యాత్ర

ముంబై: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్వర్యంలో సాగిన భారత్ జోడో న్యాయ యాత్ర ఆదివారం ముంబైలో ముగియనుంది. ఈ సందర్భంగా శివాజీ పార్కు వరకు 'న్యాయ సంకల్ప యాత్ర' పేరిట ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ ద్వారా ఇండియా కూటమి తమ బలాన్ని ప్రదర్శించబోతోంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ యాత్రలో పాల్గొనున్నారు. భారత్ జోడో న్యాయ యాత్ర దాదర్‌లోని అంబేద్కర్ స్మారకమైన చైత్ర భూమి వద్ద ముగుస్తుంది. ఆదివారం ఉదయం ముంబైలోని మణి భవన్ నుంచి ఆగస్ట్ క్రాంతి మైదాన్ వరకు న్యాయ సంకల్ప పాదయాత్రను రాహుల్ చేపడతారు. మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విజయ్ వడెట్టివర్ కార్యాలయం ఈ మేరకు ప్రకటన వెలువరించింది. అన్ని రంగాల నుంచి ప్రముఖులు యాత్రలో పాల్గొనబోతున్నట్లు తెలిపింది. యాత్రలో పాల్గొన్న వారితో ఆగస్ట్ క్రాంతి మైదాన్ సమీపంలోని తేజ్‌పాల్ హాల్‌లో రాహుల్ మాట్లాడతారని వెల్లడించింది. మణి భవన్... మహాత్మాగాంధీ ముంబై నివాసం. శివాజీ పార్కు వద్ద సభలో రాహుల్ ప్రసంగిస్తారని విజయ్ వడెట్టివర్ పీటీఐకి తెలిపారు. సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఢిల్లీ ఆరోగ్య మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్, ఎన్‌సీ నేత ఫరూక్ అబ్దుల్లా, జార్ఖండ్ సీఎం చంపై సోరెన్, మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు హాజరవుతారని తెలిపారు.

PRINTED & PUBLISHED BY EDUPUGANTI NAGESHWARA RAO, On Behalf of VISALAANDHRA VIGNANA SAMITI, PRINTED AT AMODA PUBLICATIONS PVT. LTD, AMODA PRESS, Andhra Jyothi Buildings, S.No: 1/1 & 1/2, Near Indus High School,Gooty Road, Pandipadu Grama Panchayati, KURNOOL, ANDHRA PRADESH, PUBLISHED AT VISALAANDHRA VIGNANA SAMITI, C.R.BHAVAN, SAPTAGIRINAGAR, KURNOOL, ANDHRA PRADESH. EDITOR : R.V. RAMARAO. RNI NO:APTEL/2013/54446. Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : 08518-255522,255555, Fax No. 277721, E-Mail : visknl@ yahoo.com